వడ్రంగి వర్క్ షాపులు దగ్ధం

దగ్ధమైన షాపుల వద్ద బాధితులు

కుంటాల, మార్చి, 30 : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో శనివారం మూడు వడ్రంగి షాపులలో అగ్ని ప్రమాదం జరిగింది. వడ్రంగి పనినే వృత్తిగా ఆచరిస్తూ జీవనం సాగిస్తున్న బాధిత కార్పెంటర్లు వేల్పూర్ రాజశేఖర్, రంజిత్, రాకేశ్ తెలిపిన వివరాల ప్రకారం వారికి చెందిన మూడు వర్క్ షాపులు రాత్రి 11 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక షాపులో మంటలు చెలరేగగా ఆనుకొని ఉన్న మరో రెండు షాపులకు వ్యాపించి దగ్ధమయ్యాయి. వీటిలో ఉన్న విలువైన ముడి కలప, తయారు చేసిన ఫర్నిచర్, విలువైన విద్యుత్ పనిముట్లు కాలి బూడిదయ్యాయి. ఏ రాత్రి చుట్టు పక్కల వారికి అగ్ని వేడిమికి కొందరు మేల్కొనడంతో కొందరికి తెలపడంతో గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందివ్వడంతో ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పింది. అయినా అప్పటికే వర్క్ షాప్‌లు కాలిపోయాయి. చుట్టు పక్కల నివాస గృహాలు ఉండడంతో మరోవైపు మంటలు వ్యాప్తి చెందకుండా అగ్ని మాపక సిబ్బంది నియంత్రించగలిగారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తమ కలప షెడ్లు, పనిముట్లు అగ్నికి ఆహుతి అవడంతో ఇదే కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ యువకుల స్థితి అగమ్యగోచరంగా తయారైంది. దగ్ధమైన కలప పనిముట్లు తయారు చేసిన ఫర్నిచర్ విలువ మొత్తం రూ. 40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, అధికారులు, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

రాకపోకలకు అంతరాయం

కూలిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, మార్చి 30: మండలంలోని హస్నాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం గాలికి ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడింది. దీంతో వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెట్టును నరికి తొలగించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు గ్రామస్తులను అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కిషన్‌రావు(ఫైల్)

దిలావర్‌పూర్ మార్చి 30 : నిర్మల్ భైంసా 61వ జాతీయ రహదారిపై మండలంలోని న్యూ లోలం గ్రామ సమీపంలో(శనివారం అర్ధరాత్రి) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్(జీ) మండలంలోని బామిని గ్రామానికి చెందిన జీ,కిషన్‌రావు (55)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు నిర్మల్ వైపు నుంచి భైంసా వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.

సరిహద్దులో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభం

భీంపూర్, మార్చి30: భీంపూర్ మండల సరిహద్దు మారుమూల గ్రామం గుబిడిలో ఆదివారం బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇన్ని సంవత్సరాలు కమ్యూనికేషన్ లేక ఇబ్బంది పడిన ఆ గ్రామస్తులు దీనిపై హర్షం వ్యక్తంజేశారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

రామేశ్వర్(ఫైల్)

ఇంద్రవెల్లి, మార్చి 30 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని మోహన్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన సాబ్లే భోజ్‌రాజ్‌కు చెందిన కుమారుడు సాబ్లే రామేశ్వర్(24)అదృశ్యమైనట్లు ఎస్ఐ దుబ్బాక సునీల్ తెలిపారు. ఆదివారం రాత్రి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని మోహన్‌సింగ్‌తండాకు చెందిన సాబ్లే రామేశ్వర్ ఈ నెల 28న ఇంటి నుంచి బయలు దేరి ఆదిలాబాద్‌లోని ఓ బ్యాంకుకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పివెళ్లాడు. జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకు వెళ్లిన తమ కొడుకు సాబ్లే రామేశ్వర్ సాయంత్రమైన తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. దగ్గర బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుబ్బాక సునీల్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్/గుడిహత్నూర్/నేరడిగొండ, మార్చి 30 : బోథ్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. బోథ్‌కు చెందిన అంబటి లక్ష్మికి రూ.18 వేలు, తలమడుగు మండలం కుచ్లాపూర్‌కు చెందిన డీ.సురేశ్‌కు రూ.22,500, గుడిహత్నూర్ మండలం కొల్హారికు చెందిన పంచపులకు రూ.30 వేలు మంజూరు అయ్యాయి. సంబంధిత చెక్కులను ఎమ్మెల్యే వారికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేందర్, దేవరావ్, రమణ గౌడ్, శ్రీఖను, వామన్, విష్ణు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరడిగొండలో ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ, మార్చి 30 : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఉగాది పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం పర్యటించారు. కాలినడకన వీధుల్లో తిరుగుతూ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సూపర్ జ్యూస్ సెంటర్ వద్దకు చేరుకోగా జ్యూస్ సెంటర్ యజమాని నిమ్మరసం తాగించారు. అనంతరం ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ పర్యటించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ సయ్యద్‌జహీర్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు పండరి, రాథోడ్ సురేందర్, శేఖర్, లింబాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి గ్రామస్తుల సాయం

ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

ఇంద్రవెల్లి, మార్చి30 : మండలంలోని బీక్కుతండా గ్రామానికి చెందిన సెడ్మకి చంద్రకాంత్(35) జీవితంపై విరక్తి చెందిన ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉగాది పండుగ కావడంతో గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు, గ్రామ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తమవంతుగా ఆర్థిక సహాయంగా 21 వేల రూపాయలతోపాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పరుశురాం నాయక్, రాంనివాస్‌నాయక్, భీంసింగ్, నర్సింగ్, శేషరావ్, విజయ బాయి, రామేశ్వర్, సవాయిరాం, ఫూల్‌చంద్, తులసీరాం, ప్రకాశ్, సీతారామ్, ఉద్యోగులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంత్యుత్సవాలు

ఇంద్రవెల్లి, మార్చి30 : ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏప్రిల్ 14న నిర్వహించే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉట్నూర్ మండలకేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పుష్పగుచ్చాలు అందించి, జయంతి ఉత్సవాలకు చెందిన పోస్టర్లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, అంబేద్కర్ సంఘాల నాయకులు సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మారే కామ్‌రాజ్, మస్కేరాజ్‌వర్దన్, దీలిప్ మోరే, నాగోరావ్, దత్తా ఆచార్యే, దత్తా పరత్‌వాగ్, జితేందర్, శివాజీ, బాపురావ్, ఉత్తమ్, సూరజ్, లక్ష్మణ్, సంజయ్, అనిల్, నాయకులు ఎండీ మసూద్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎదులాపురం, మార్చి 30 : భూగర్భ జలాల స్థాయి భారీగా తగ్గిన నేపథ్యంలో ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని, వర్షాలు కురిసేంత వరకు ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలో సరఫరా అయ్యే ఆదిలాబాద్ రూరల్ మండలంలో లాండసాంగి పంప్ హౌస్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. అధిక లోడ్ ఉండే మోటర్లను బిగించేల టెండర్లను పిలిచేలా చూడాలని సూచించారు. అనంతరం లాండసాంగి చెరువును పరిశీలించి మున్సిపల్ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిశోర్‌తో మాట్లాడి నీటి ఎద్దడిని వివరించి సహకారం అందించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. పట్టణంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ తిరుపతి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వేదావ్యాస్, మాజీ కౌన్సిలర్‌లు ప్రవీణ్, రాజేశ్, జోగు రవి, లాలామున్న, నాయకులు విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిపానిలో రోడ్డు పనులు ప్రారంభం

భీంపూర్, మార్చి 30: భీంపూర్ మండలం నిపాని గ్రామంలో ఆదివారం భూమిపూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. నిపాని నుంచి గొల్లగడ్ వైపు 3 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కృషితో మంజూరైంది. ఈ కార్యక్రమంలో నాయకులు కేమ రాజన్న, మార్సెట్టి అనిల్, ముకుంద సంతోష్, మల్లెల స్వామి , నారాయణరెడ్డి , రాజేశ్వర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పాల్వాయి దిష్టిబొమ్మ దహనం


గొల్లగడ్‌లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

భీంపూర్, మార్చి30: భీంపూర్ మండలం గొల్లగడ్‌లో కొలాం గిరిజనులు ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో మన్నేవార్‌లకు కూడా కొలావార్ గిరిజన పీవీజీటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరడంపై నిరసన వ్యక్తం జేశారు. ఈ కార్యక్రమంలో టేకాం గణేశ్, సూర్య, రాము, హనుమంతు తదితరులున్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక చేయూత


దాబా(కే)లో ఆర్థిక సాయం చేస్తున్న అభిమాన్యూ సంఘం సభ్యులు

నార్నూర్, మార్చి 30 : తల్లిదండ్రుల మరణంతో అనాథలైన పిల్లలకు అభిమాన్యూ సంఘం సభ్యులు అండగా నిలిచారు. గాదిగూడ మండలం దాబా(కే)గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. తల్లిదండ్రుల మృతి గల కారణాలు చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. రూ.36,700లు ఆర్థిక చేయుతనిచ్చారు. ఈ కార్యక్రమంలో సార్‌మెడి మండాడి దౌలత్‌రావు, కోడప జాకు, పూసం బాదిరావు, పెందోర్ సంతోష్,ఉపాధ్యాయుడు మెస్రం లింగు, రాజ్‌కుమార్, లక్ష్మణ్, ప్రభు తదితరులున్నారు.

ఊరూరా ఉగాది సంబురం

- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- దుక్కులు దున్ని సాగు పనులు ప్రారంభించిన రైతులు

ఆదిలాబాద్‌లో పచ్చడి పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

నమస్తే నెట్‌వర్క్, మార్చి 30 : సనాతన హిందూధర్మంలో ఉగాది పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లోని వినాయక చౌక్‌లో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అజయ్, ఇజ్జగిరి నారాయణ, లింగా రెడ్డి, రాజన్న, దమ్మపాల్ ధమ్మాపాల్, కొండా గణేశ్, స్వరూప రాణి, బొడగం మమత, బట్టు సతీశ్, కోరెడ్డి ప్రవీణ్, నవతే శ్రీనివాస్, మౌర్య సురేందర్, దయానంద్, మహేశ్ పాల్గొన్నారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని వినాయక చౌక్, సరస్వతీ శిశుమందిర్ వద్ద ఉగాది పచ్చడి, గుడాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా 70 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు వయవృద్ధుల సమైక్య ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు అందించి సన్మానించారు. నేరడిగొండ మండలంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామమైన రాజురాలో వ్యవసాయ క్షేత్రంలో ఎద్దులను అలంకరించి దౌర కొట్టి సాగు పనులు ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనం చేశారు. ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామంలో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. క్యాంప్ కార్యాలయంలో ఉట్నూర్ సాహితీ వేదిక-దేవకీయ సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉగాది వేడుకల్లో పాల్గొని కవులను ఎమ్మెల్యే సన్మానించారు. పాత ఉట్నూర్ లోని రామాలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వర్షాలు కురిసి పంటలు పండాలని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పూజలు చేశారు. ఆదివాసీ గూడేల్లో నవధాన్యాలతో గుడాలు తయారు చేసి బసవన్నలకు నైవేద్యంగా తినిపించారు. గ్రామస్తులు సహపంక్తి భోజనాలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో భూతల్లి పూజలు చేశారు. ఎడ్లను అలంకరించి అరక కొట్టి సాగు పనులు ప్రారంభించారు.

నిర్మల్ జిల్లాలో..

తెలంగాణ జానపద కళాజాతర ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఆర్కే కన్వెన్షన్‌లో యజ్ఞం, పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నృత్యమాల, స్వరూపిణి నాట్య అకాడమీ చిన్నారుల కూచిపూడి నృత్యాలు, యోగా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం జబర్దస్త్ టీం సభ్యులు వినోదిని, నవీన్, సుధాకర్ టీం సభ్యులు కామెడీ స్కిట్‌లతో అలరించారు. భైంసా పట్టణంలో శివాజీ చౌరాస్తాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. ఖానాపూర్‌లో మండలంలోని మస్కాపూర్ లోని గంగాయిపేటలో ఇటుక బట్టి కార్మికులకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచితంగా చీరేలను, పండ్లను పంపిణీ చేశారు. దస్తురాబాద్, దిలావర్‌పూర్, ముథోల్, భైంసా పట్టణం మండలాల్లో పలు ఆలయాల్లో పంచంగ శ్రవణ, గ్రామాల్లో రైతులు అరక కొట్టి సాగు పనులు ప్రారంభించారు. నిర్మల్ పట్టణంలోని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం భవనంలో నిర్మల బారతి, సాహితి క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా 51 మంది తెలుగు ఉర్దూ కవులు పాల్గొని కవితా గానం చేశారు.ప్రతిభ కనబర్చిన కవులను మొమెంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్షుడు భూమన్న యాదవ్, తదితరులున్నారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

సిరికొండలో సాగు పనులు ప్రారంభిస్తున్న రైతులు

నిర్మల్‌లో వేడుకల్లో జబర్దస్త్ బృందం ప్రదర్శన

క్రీడా పోటీలతో స్నేహభావం

పోటీలు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మార్చి 30 : ఇరు జట్ల మధ్య క్రీడా పోటీలు మంచి స్నేహభావాన్ని పెంపొందించేలా స్ఫూర్తిని ప్రదర్శించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో గ్రామ యూత్ సభ్యులు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిని అభినందనలు తెలిపారు. అనంతరం టాస్ వేసి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతూ ఉత్సాహ పరిచారు. మొదట గ్రామస్తులు డీజే చప్పుల మధ్య జోగు రామన్నకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామ పొలిమేర గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతను క్రీడారంగంతో పాటు ఉన్నత చదువులో రాణించేలా జోగు ఫౌండేషన్ తరుపున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్‌తో పాటు నర్సింగ్ కాలేజ్, మంజూరు చేయడమే కాకుండా 500 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ్వా జగదీశ్, కుమ్రరాజు, ఇజ్జగిరి అశోక్, అజయ్, దాసరి రమేశ్, దమ్మపాల్, కొండ గణేశ్, రంగినేని శ్రీనివాస్, బట్టు సతీశ్, మౌర్య సురేందర్, దయాకర్, అశోక్, నిర్వాహకులు వంశీ కృష్ణ, శ్రీకాంత్, ప్రశాంత్, రాము పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 30 : రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. ఆదివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాను పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దాదాపు 350 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని ప్రార్థనా సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, గోపినాథ్, ప్రేమ్ కుమార్, తదితరులున్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన

భైంసా, మార్చి, 30 : పట్టణంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలో గల ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లను ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. ఈద్గా, మసీదుల్లో, ముఖ్యమైన ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈమె వెంట పట్టణ సీఐ గోపినాథ్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్@ గిబ్లీ స్టైల్ !

కలెక్టర్ అభిలాష అభినవ్ షేర్ చేసిన గిబ్లీ స్టైల్ చిత్రం

కుంటాల, మార్చి, 30 : ఇటీవల తాజాగా విడుదలైన ఓ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇమేజ్ జనరేటర్ యాప్ ద్వారా యూజర్లు సృజనాత్మకతతో తమ కుటుంబ సభ్యులు, మిత్రులు, తమ ఏఐ జనరేటెడ్ చిత్రాలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. ఇదే తరహాలో ఆదివారం నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ తన భర్తతో కలిసి దిగిన చిత్రాన్ని సరదాగా ఎక్స్‌లో షేర్ చేశారు.

గ్రూప్-1 ఫలితాల్లో నిర్మల్ అదనపు కలెక్టర్ సతీమణి ప్రతిభ

బరీరా ఫరీద్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి,30 : గ్రూప్ 1 ఫలితాల్లో నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సతీమణి బరీరా ఫరీద్ రాష్ట్ర స్థాయిలో 68 వ ర్యాంకును బీసీఈ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించారు. బరీరా ఫరీద్ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డిగ్రీని పూర్తి చేశారు. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న ఆమె 2022 లో సివిల్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫరీరుద్దీన్, షమీన్ ఉన్నీసాల కూతురు బరీరా ఫరీద్ ఆమె తండ్రి భారత వాయుసేనలో రిటైర్డ్ ఉద్యోగి. ఏడుగురు సంతానంలో బరీరాఫరీద్ అందరిలో చిన్నది. గ్రూప్-1 లో ప్రతిభ చూపినందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కుటుంబసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్పీగా ఎంపికైన యువకుడికి సన్మానం

మహేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బాసర, మార్చి 30 : బాసర మండలం కిర్గుల్(బీ) గ్రామానికి చెందిన కరెండె మహేందర్ గ్రూప్ 1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యాడు. దీంతో ఆదివారం మహేందర్‌ను తాజామాజీ సర్పంచ్ సుధాకర్, గ్రామస్తులు సన్మానించారు. కొన్ని రోజులుగా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహేందర్ డీఎస్పీగా ఎంపికై ఆదివారం స్వగ్రామానికి చేరుకోగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహేందర్‌కు గ్రామస్తులు స్వీట్లు తినిపించి అభినందించారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు ఆదిలాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బీసీ, ఈబీసీ (ఈడబ్ల్యూఎస్)కి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. రూ.50 వేల లోపు విలువ చేసే యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, రూ.లక్షలోపు యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల యూనిట్‌కు 80 శాతం, రూ.4 లక్షల వరకు విలువ చేసే యూనిట్‌కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపన కోసం 21-55 ఏళ్ల వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21-60 ఏళ్ల వయసు కలిగిఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉన్న వారు అర్హులని, బ్యాంక్ సమ్మతి తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా పత్రాలను తప్పనిసరిగా జత పర్చాలన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో 2025 ఏప్రిల్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తులను అర్జీదారు డౌన్ లోడ్ చేసుకుని, దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా పత్రాలను జత చేసి సంబంధిత మండల ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలలో అందజేయాలన్నారు. అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కొనసాగుతున్న సీసీఐ సాధన కమిటీ రిలే దీక్షలు


నిరసన తెలుపుతున్న సీసీఐ సాధన కమిటీ సభ్యులు

ఎదులాపురం, మార్చి 30 : సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 12వ రోజుకు చేరుకున్నది. ఉగాది పండుగ సందర్భంగా దీక్ష శిబిరం వద్ద ఉగాది పచ్చడితోపాటు గుడాలు తింటూ నిరసన వ్యక్తం చేశారు. దీక్షలో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో కన్వీనర్లు విజ్జగిరి నారాయణ, అరుణ్ కుమార్, కొండ రమేశ్, బండి దత్తాత్రి, వెంకట్ నారాయణ, ముడుపు ప్రభాకర్ రెడ్డి, బమాన్ జగన్, బొల్లు ఈశ్వర్, బొజ్జ ఆశన్న కూర్చున్నారు.

నీటి లీకేజీలను నివారించాలి

రోడ్డుపైనే పారుతున్న మిషన్ భగీరథ నీరు

బోథ్, మార్చి 30 : మండలంలోని ధన్నూర్(బీ) గ్రామంలో నల్లాల నీటి లీకేజీలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పలు చోట్ల పైపులు పగిలి మిషన్ భగీరథ నీరు రోడ్లపైనే పారుతుందని పేర్కొన్నారు. బస్టాండ్ నుంచి హనుమాన్ టెంపుల్ వరకు పలు చోట్ల వారం రోజులుగా లీకేజీలతో నీరు వృథాగా పోతున్నదని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు స్పందించి లీకేజీలు నివారించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఇటిక్యాల చెక్‌డ్యాం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెంబి, మార్చి 30: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామంలో కడెం వాగుపై రూ. 5.2 కోట్లతో చెక్‌డ్యాం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చెక్‌డ్యాం కట్ ఆఫ్‌వాల్ నిర్మిస్తున్నారు. కాగా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని, పనులను నాసిరకంగా చేపడుతున్నారని, నాణ్యమైన సిమెంట్‌ను ఉపయోగించడంలేదని చెక్‌డ్యాం వద్ద రైతులు రూప్‌సింగ్, భీమ్‌జీ, సుందర్ లాల్, బాపురావ్, జైవంత్‌రావ్, రవితో పాటు పలువురు ఆదివారం నిరసన తెలిపారు. అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఏఈ నవీన్‌ని వివరణ కోరగా పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు.

ఆగని కలప అక్రమ రవాణా..!

పట్టుకున్న కలప

ఖానాపూర్ రూరల్, మార్చి 30 : ఇటీవల ఖానాపూర్‌లో అడవుల నరికి వేతలో పలువురిని రిమాండ్ చేసి జైలుకు పంపిన ఘటన మరువక ముందే మళ్లీ ఖానాపూర్ అడవుల్లో అలజడులు మొదలయాయ్యయి. ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి అటవీ శివారులో శనివారం రాత్రి అడవి నుంచి కలపను తరలిస్తున్న ఎడ్లబండి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం రాత్రి అటవీ బేస్ క్యాంపు వ్యక్తులతో పాటు బీట్ ఆఫీసర్ అనుపమ కలప దుంగలతో ఉన్న ఎడ్ల బండిని పట్టుకున్నారు. ఆదివారం ఉదయం నిందితుడు ఈడగోటి హనుమంతుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కలప పట్టివేత విషయాన్ని గోప్యంగా ఉంచడం, కేసు ఆలస్యంగా నమోదు చేశారని స్థానికుల నుంచి ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై ఎఫ్ఆర్వో కిరణ్‌ను వివరణ కోరగా కలపను పట్టుకున్న విషయం నిన్ననే తన దృష్టికి వచ్చిందని, వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

భైంసా, మార్చి, 30 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి సత్కరించడంతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 36 పాఠశాలలకు వివిధ పనుల కోసం మొత్తం రూ.50 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. త్వరలో మిగిలిన పాఠశాలలోని వివిధ పనుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ రావు, గంగాధర్, కృష్ణ, అబ్దుల్ అహద్, గంగామోహన్, పుండలిక్, విశ్వనాథ్, గోపాల్, వసంత్ రావు, సలీం, హైమద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

దస్తురాబాద్, మార్చి 30 : వ్యవసాయ పనిముట్లకు మహిళ రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి మనసా అన్నారు. నేటితో గడువు ముగుస్తుందని ఆసక్తి గల మహిళా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లకు సంబంధిత వ్యవసాయ అధికారుల వద్ద దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. భాగంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఎస్ఎంఏఎం పథకంలో భాగంగా మండలానికి 21 వ్యవసాయ పని ముట్లు 50 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు ఫారం వెంట పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జీరాక్స్‌లు, రెండు ఫొటోలను జత చేసి వ్యవసాయ కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు.

కుంటాల ఎస్ఐగా అశోక్

ఎస్ఐ అశోక్

కుంటాల, మార్చి, 30 : కుంటాల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సీ. అశోక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దస్తురాబాద్ పీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఎస్ఐ భాస్కరాచారిని నిజామాబాద్ ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం.

నాయీ బ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక

దస్తురాబాద్, మార్చి 30 : దస్తురాబాద్ గ్రామ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపెల్లి నారాయణను, సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ కార్యవర్గాన్ని అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, రమేశ్, రాకేశ్, రమణ, శేఖర్, గంగన్న, తదితరులున్నారు.

మున్నూరుకాపు నూతన కార్యవర్గం

కుంటాల, మార్చి, 30 : కుంటాల గ్రామ మున్నురుకాపు సంఘం అధ్యక్షుడిగా తోట రఘు పటేల్, ఉపాధ్యక్షుడిగా జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శిగా మాగం నాగరాజ్, కోశాధికారిగా సీపతి వివేకానందలను ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. ఉగాది సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు.

రజక సంఘం కార్యవర్గం

కుంటాల, మార్చి, 30 : కుంటాల మండల కేంద్ర రజక సంఘం కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎల్ద గజేందర్, ఉపాధ్యక్షుడిగా కాశీరాం గజేందర్, ప్రధాన కార్యదర్శి గడ్డం గజేందర్, కోశాధికారిగా పడకంటి రాజును ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం ఇటీవల అగ్నివీర్‌కు ఎంపికైన అరిగెల అరుణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు, గజ్జారాం, సదాశివ్, పండరి, సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జిగా భూషణ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి, 30: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జిగా అమ్ముల భూషణ్ నియమితులైనట్లు అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ ఏ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ జిల్లాలో తైక్వాండో అసోసియేషన్ తరపున జిల్లా కార్యకలాపాలతో అనుసంధానించేందుకు ఆయన బాధ్యత వహిస్తారని తెలిపారు.

సైనిక్ ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు

దిలావర్‌పూర్, మార్చి 30 : దిలావర్‌పూర్‌కు చెందిన పసుల అద్విత్‌కు సైనిక్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు లావణ్య, పవన్ తెలిపారు. అద్విత్‌ను ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

కుభీర్, మార్చి, 30 : కుభీర్‌లో ఉగాది సందర్భంగా విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు ఆదివారం జరిగాయి. ఆలయంలో పూజల అనంతరం రూ.100 తో మొదలైన పోటీలు రూ. 5 వేల వరకు కొనసాగాయి. ఈ పోటీలను వీక్షించేందుకు కుభీర్ మండలంలోని వివిధ గ్రామాలతో పాటు చుట్టు పక్కల మండలాలు, పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వందలాది మంది తరలివచ్చారు. విజేతలకు నిర్వాహకులు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బీ. పెంటాజీ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.